ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 1 | సంచిక: 341 | పేజీలు: 4 | వెల: రూ.3/- | ఆదివారం 17 మార్చి 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్




## మేం సిద్ధం..

సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలపై మోదీ ఇంట్రెస్టింగ్ ట్వీట్

2లో..

## సార్వత్రిక ఎన్నికలకు మోగిన

# నగారా

### ఎన్నికల షెడ్యూల్ విడుదల

### 7 దశల్లో పోలింగ్.. జూన్ 4న ఫలితాలు

- 96.8 కోట్ల మంది ఓటు వేసేందుకు అర్హత
- దేశంలో కోటీ 82 లక్షల మంది కొత్త ఓటర్లు
- 19.47 కోట్ల మంది 20 నుంచి 29 ఏళ్ల మధ్య వయసున్నవారు
- పురుషులు 49.7 కోట్లు.. మహిళలు 47.1 కోట్లు
- దేశవ్యాప్తంగా 10.5 లక్షల పోలింగ్ స్టేషన్లు
- ఎన్నికల విధుల్లో 1.5 కోట్ల మంది ఉద్యోగులు
- ఎన్నికల కోసం 55 లక్షల ఈవీఎంలు సిద్ధం
- దేశవ్యాప్తంగా ఓటర్ల నిష్పత్తి ప్రతి 1000 మంది పురుషులకు 948 మహిళా ఓటర్లు.
- 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువ
- 85 ఏళ్ల వయసు మించిన ఓటర్లు దేశంలో 82 లక్షల మంది




న్యూఢిల్లీ, మార్చి 16 (ప్రభాత ఉదయం): ఎప్పుడెప్పుడా అని దేశం మొత్తం ఎదురు చూస్తున్న తరుణం రానే వచ్చింది. సార్వత్రిక ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశవ్యాప్తంగా 7 దశల్లో పోలింగ్ జరగనుంది. ఏప్రిల్ 19 వ తేదీ నుంచి జూన్ 1 వ తేదీ వరకు ఈ 7 విడతల పోలింగ్ నిర్వహించనున్నారు. ఇక లోక్‌సభతోపాటు ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, ఒడిశా రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరగనున్నాయి. ఇక దేశవ్యాప్తంగా 26 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉపఎన్నికలు నిర్వహించనున్నారు. జూన్ 4 వ తేదీన ఎన్నికల లెక్కింపు చేపట్టి రిజల్ట్ వెలువరిస్తామని స్పష్టం చేశారు.

గత కొన్ని రోజులుగా దేశంలో లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌కు సంబంధించి నెలకొన్న ఉత్కంఠ వీడింది. రాజకీయ పార్టీలు, దేశ ప్రజలు ఎదురుచూస్తున్న సార్వత్రిక ఎన్నికల తేదీలు వెలువడ్డాయి. లోక్‌సభతోపాటు దేశంలోని రాష్ట్రాల అసెంబ్లీలకు కలిపి ఎన్నికలు నిర్వహించనున్నారు. మొత్తం విడతల్లో సార్వత్రిక ఎన్నికలు

..మిగతా 2లో



## బీఆర్ఎస్ ఎమ్మెల్సీ

# కవితకు షాక్

### 7 రోజుల ఈడీ కస్టడీకి కోర్టు అనుమతి

న్యూఢిల్లీ, మార్చి 16 (ప్రభాత ఉదయం): ఢిల్లీ లిక్కర్ స్కాంలో మనీ లాండరింగ్ ఆరోపణలతో అరెస్టైన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు షాక్ తగిలింది. కవితను ఈడీ కస్టడీకి అనుమతిస్తూ రౌస్ ఎవెన్యూ సీబీఐ ప్రత్యేక కోర్టు తీర్పు ఇచ్చింది. ఈ నెల 23 వరకూ ఆమెకు కస్టడీ విధించారు. శుక్రవారం సాయంత్రం ఆమె ఇంట్లో సోదాలు నిర్వహించిన ఈడీ అధికారులు అనంతరం ఆమెను అరెస్ట్ చేశారు. రాత్రి ఢిల్లీలోని ఈడీ కార్యాలయానికి తరలించారు. శనివారం ఉదయం వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం ఆమెను రౌస్ అవెన్యూ కోర్టులో హాజరు పరిచారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయస్థానం.. ఈ నెల 23 వరకూ కవితను ఈడీ కస్టడీకి అనుమతించింది. ఈ మేరకు న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. ప్రతీ రోజూ కుటుంబ సభ్యులు, న్యాయవాదులను కలిసేందుకు.. ఇంటి నుంచి తెచ్చిన ఆహారం తీసుకునేందుకు కూడా కోర్టు అనుమతించింది. ఈ నెల 23న మధ్యాహ్నం కోర్టులో హాజరు పరచాలని ఆదేశాలిచ్చింది. కవిత తరఫున సీనియర్ న్యాయవాదులు విక్రమ్ చౌదరి, మోహిత్ రావులు వాదనలు వినిపించగా.. ఈడీ తరఫున జోయబ్ హుస్సేన్, ఎన్.కే మట్టా వాదనలు వినిపించారు. కవిత రిమాండ్ రిపోర్టులో ఈడీ కీలక విషయాలు వెల్లడించింది. 'ఢిల్లీ లిక్కర్ స్కాంలో సౌత్ లాబీ పేరుతో కవిత కీలకంగా వ్యవహరించారు. లిక్కర్ విధానంలో ఆమెనే ప్రధాన లబ్ధిదారు. ఆప్ పార్టీకి రూ.100 కోట్లు ఇవ్వడంలో కవిత కీలక సూత్రధారి. మాగుంట శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఆప్ నేతలతో ఆమె కుట్రకు పాల్పడ్డారు. కవితకు బినామీగా రామచంద్ర పిళ్లై ఉన్నారు. ఆయన ద్వారానే ఆమె మొత్తం వ్యవహారం నడిపించారు. అరుణ్ పిళ్లైని డమ్మీగా పెట్టి ఇండోస్పిరిట్ కంపెనీలో కవిత వాటా పొందారు. ఇతరులతో కలిసి రూ.100 కోట్ల లంచాలను ఆప్ నేతలకు ఆమె ఇచ్చారు. తన మొబైల్ లోని ఆధారాలు తొలగించారు. సౌత్ గ్రూప్ లోని శరత్ చంద్రారెడ్డి, మాగుంట శ్రీనివాస్ రెడ్డి, రాఘవ మాగుంటతో కలిసి ఆప్ నేతలతో కవిత కుట్రలు పన్నారు. మాగుంట ద్వారా రూ.30 కోట్లను ఢిల్లీకి చేర్చారు. ఈ సొమ్మును అభిషేక్ బోయినపల్లి ఢిల్లీకి తీసుకెళ్లాడు.' అంటూ

..మిగతా 2లో



## కేజ్రీవాల్‌కి ఊరట

2



### సీఏఏ అమలు

## నిలిపివేయాలి

సుప్రీంకోర్టును ఆశ్రయించిన అసదుద్దీన్ ఒవైసీ

2



## 'కవిత అరెస్టుపై కేసీఆర్ మౌనం ఎందుకు?'

### ఎన్నికల స్టంట్ అంటూ సీఎం రేవంత్ విమర్శలు

### 100 రోజుల పాలన సంతృప్తి ఇచ్చిందని వెల్లడి

హైదరాబాద్, మార్చి 16 (ప్రభాత ఉదయం): కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల పాలన ఎంతో సంతృప్తినిచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి శనివారం అన్నారు. ఢిల్లీ లిక్కర్ కేసులో కవిత అరెస్టుపైనా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను ఈడీ అరెస్టు చేయడంపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. ఇది ఎన్నికల స్టంట్ అంటూ ఆయన విమర్శించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. తన కుమార్తె కవిత అరెస్టుపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ప్రజాపాలనకు వంద రోజులు పూర్తి కానున్న నేపథ్యంలో మంత్రులతో కలిసి ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. 'కవిత అరెస్టును కేసీఆర్ ఎందుకు ఖండించలేదు.?. కేసీఆర్, ప్రధాని మోదీ మౌనం వెనుక వ్యూహం ఏంటి.? గతంలో ఈడీ వచ్చాక మోదీ వచ్చేవారు. అయితే, శుక్రవారం మోదీ, ఈడీ కలిసే వచ్చారు. కేసీఆర్ కుటుంబం, బీజేపీ మద్యం కుంభకోణాన్ని ధారావాహికలా నడిపించారు. కవిత అరెస్ట్ బీఆర్ఎస్, బీజేపీ ఆడుతున్న డ్రామా. ఎన్నికల షెడ్యూల్ కు ఒక రోజు ముందే జరిగిన ఈ పరిణామాన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలి. రాష్ట్రంలో కాంగ్రెస్ ను దెబ్బ తీసేందుకు బీఆర్ఎస్, బీజేపీలు కలిసి చిల్లర రాజకీయాలు చేస్తున్నాయి. ఈ అరెస్ట్ ఎన్నికల స్టంట్. తెలంగాణకు ప్రధాని మోదీ చేసింది ఏమీ లేదు. ఆయనకు ఇక్కడ ఓట్లు అడిగే అర్హత లేదు.' అని రేవంత్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల పాలన సంతృప్తి ఇచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి

..మిగతా 2లో

## బీఆర్ఎస్‌తో కలిసి నడుస్తా

### బీఎస్పీకి రాజీనామా అందుకే.. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

హైదరాబాద్, మార్చి 16 (ప్రభాత ఉదయం): తెలంగాణ బీఎస్పీ అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కీలక ప్రకటన చేశారు. బీఆర్ఎస్‌లో చేరికపై క్లారిటీ ఇచ్చారు. బహుజన్ సమాజ్‌వాదీ పార్టీ(బీఎస్పీ)కి రాజీనామా చేయడంపై మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్పందించారు. మోడీ, అమిత్ షా ఇద్దరు కలిసి బీఎస్పీ అగ్రనాయకత్వంపై ఒత్తిడి తెచ్చి బీఆర్ఎస్‌తో పొత్తు రద్దు చేసుకోమన్నారని, ఆ విషయాన్ని ప్రెస్‌మీట్ పెట్టి ప్రకటించాల్సిందిగా తనకు అధిష్టానం నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. తనకు అది ఇష్టం లేకనే బీఎస్పీ పార్టీకి రాజీనామా చేసినట్లు ఆర్ఎస్పీ క్లారిటీ ఇచ్చారు. రాజీనామా చేస్తున్నట్లు ట్విట్టర్‌లో ఉదయం ప్రకటించిన ఆర్ఎస్పీ.. సాయంత్రం మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత

..మిగతా 2లో



## కంటోన్మెంట్ ఉపఎన్నికకూ షెడ్యూల్

### తానే పోటీ చేస్తానన్న లాస్య నందిత సోదరి

హైదరాబాద్, మార్చి 16 (ప్రభాత ఉదయం): లాస్య నందిత మరణంతో ఖాళీ అయిన కంటోన్మెంట్ ఉపఎన్నిక కూడా లోక్ సభ ఎన్నికలతోపాటే జరగనుంది. తాను పోటీ చేస్తేతానని లాస్య నివేదిత ప్రకటించారు. కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో తాను పోటీ చేస్తానని దివంగత బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్యనందింత సోదరి నివేదిత

..మిగతా 2లో



## 'తెలంగాణ ప్రజల కలలను బీఆర్ఎస్, కాంగ్రెస్ ధ్వంసం చేశాయి'

### రాష్ట్ర అభివృద్ధికి ఎన్డీఏ ప్రభుత్వం కృషి చేసిందన్న ప్రధాని మోదీ



నాగర్‌కర్నూల్, మార్చి 16 (ప్రభాత ఉదయం): బీఆర్ఎస్, కాంగ్రెస్ అనే రెండు పార్టీల మధ్య తెలంగాణ నలిగిపోయిందని ప్రధాని మోదీ అన్నారు. తెలంగాణ ప్రజలు బీజేపీ గెలవాలని కోరుకుంటున్నారని చెప్పారు. గత పదేళ్లుగా తెలంగాణ ప్రజల కలలను బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ధ్వంసం చేశాయని ప్రధాని మోదీ అన్నారు. నాగర్‌కర్నూల్‌లో నిర్వహించిన బీజేపీ బహిరంగ సభలో శనివారం ఆయన మాట్లాడారు. 'బీఆర్ఎస్, కాంగ్రెస్ అనే రెండు విసుర్రాళ్ల మధ్య తెలంగాణ నలిగిపోయింది. ఇన్నేళ్లు బీఆర్ఎస్ అవినీతికి పాల్పడితే కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు తమ వంతు వచ్చినట్లుగా భావిస్తోంది. మల్కాజిగిరిలో ప్రజల అద్భుత స్పందన చూశాను. కాంగ్రెస్, బీజేపీ రెండూ అభివృద్ధికి అడ్డంకిగా మారాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం భారీగా అవినీతికి పాల్పడింది. 7 దశాబ్దాల పాటు దేశాన్ని దోచుకోవడం మినహా కాంగ్రెస్ పార్టీ ఏం చేయలేదు. గరీబీ హఠావో

..మిగతా 2లో

# సార్వత్రిక ఎన్నికలకు మోగిన నగారా

మొదటి పేజీ తరువాయి...

జరగనున్నాయి. ప్రస్తుత 17 వ లోక్‌సభ పదవీకాలం ఈ ఏడాది జూన్ 16 వ తేదీన ముగియనుంది. ఆలోపు ఎన్నికలు నిర్వహించి ఫలితాలు ప్రకటిస్తామని సీఈసీ రాజీవ్ కుమార్ స్పష్టం చేశారు. లోక్‌సభతోపాటు ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, ఒడిశా, సిక్కిం రాష్ట్రాల అసెంబ్లీలకు కూడా పదవీ కాలం ముగియనుండటంతో అన్నింటికీ కలిపి ఎన్నికలు నిర్వహించనున్నట్లు సీఈసీ వెల్లడించారు. ఈ క్రమంలోనే దేశవ్యాప్తంగా వెంటనే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినట్లు ప్రకటించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో వివిధ కారణాలతో తలెత్తిన ఉపఎన్నికలను కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. మొత్తం 26 అసెంబ్లీ ఎన్నికలకు బై ఎలక్షన్స్ జరగనున్నాయి. జూన్ 4 వ తేదీన ఎన్నికల ఫలితాలను ప్రకటించనున్నారు. 543 లోక్‌సభ నియోజకరవర్గాలకు ఎన్నికలు 7 దశల్లో నిర్వహించనున్నారు. ఏప్రిల్ 19 వ తేదీన తొలి విడత పోలింగ్, ఏప్రిల్ 26 వ తేదీన 2 వ విడత పోలింగ్, మే 7 వ తేదీన మూడో దశ పోలింగ్, మే 13 వ తేదీన నాలుగో విడత పోలింగ్, మే 20 వ తేదీన ఐదో దశ పోలింగ్, మే 25 వ తేదీన ఆరో దశ పోలింగ్, చివరిగా జూన్ 1 వ తేదీన ఏడో దశ పోలింగ్ జరగనుంది. ఇక నాలుగో దశలో మే 13 వ తేదీన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఎన్నికల్లో ఒకేసారి ఎన్నికలు జరగనున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 25 లోక్‌సభ, 175 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల శాసనసభలకు తొలి దశలో ఏప్రిల్ 19 వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల అసెంబ్లీలకు 13 వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. అన్ని ఎన్నికల కౌంటింగ్ జూన్ 4 వ తేదీన నిర్వహించి ఫలితాలు వెల్లడించనున్నారు. ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్ ప్లీనరీ హాల్‌లో కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్‌తో పాటు జ్ఞానేశ్‌కుమార్, సుఖ్‌బీర్ సింగ్ సంధులతో కలిసి ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. దేశవ్యాప్తంగా మొత్తం 97 కోట్ల మంది ఓటర్లు ఉన్నట్లు సీఈసీ




వెల్లడించారు. ఈసారి దేశవ్యాప్తంగా 1.82 కోట్ల మంది కొత్త ఓటర్లు తొలిసారి తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. 20 నుంచి 29 ఏళ్ల మధ్య ఉన్న ఓటర్లు మొత్తం 19.47 కోట్లు ఉన్నట్లు తెలిపారు. ఇక 85 ఏళ్లు దాటినవారికి వర్క్ ఫ్రమ్ ఓట్ అవకాశం కల్పిస్తున్నట్లు సీఈసీ వెల్లడించారు. ఏప్రిల్ 1 వ తేదీవరకు ఓటర్ల జాబితాలో తప్పులను సరిచేసుకునేందుకు అవకాశం ఇస్తున్నట్లు వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియలో దేశవ్యాప్తంగా మొత్తం 1.50 కోట్ల మంది సిబ్బంది పాలు పంచుకోనున్నారు. దేశవ్యాప్తంగా 10.50 లక్షల పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. 55 లక్షల ఈవీఎంలను వినియోగించనున్నారు. 4 లక్షల వాహనాలను ఉపయోగించుకోనున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా 2100 మంది ఎన్నికల అబ్జర్వర్లను నియమించినట్లు తెలిపారు. భారత్‌లో ఎన్నికల నిర్వహణ ఒక పెద్ద ప్రక్రియ అని అందుకోసం ప్రపంచమంతా భారత్ వైపు చూస్తోందని వెల్లడించారు. ఈ ఎన్నికల్లో హెలికాప్టర్లను, ఏనుగులను, ఒంటెలను ఉపయోగిస్తున్నామని.. ఎన్నికల సిబ్బంది నీటి ప్రవాహాలను, ఎడారి మార్గాల్లో ప్రయాణం చేసేందుకు వీటిని వినియోగిస్తామని తెలిపారు. సార్వత్రిక ఎన్నికల కోసం అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు సీఈసీ రాజీవ్ కుమార్ స్పష్టం చేశారు. సమస్యాత్మక ప్రాంతాలు, సున్నితమైన ప్రాంతాల్లో ఓటింగ్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తామని తెలిపారు. సీ-విజిల్ యాప్ ద్వారా దేశపౌరులు ఎవరైనా ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. టీవీ, సోషల్ మీడియా ప్రకటనలపై నిరంతరం పర్యవేక్షణ ఉంచుతామని స్పష్టం చేశారు. వాలంటీర్లు, తాత్కాలిక సిబ్బందిని ఎన్నికలకు దూరంగా ఉంచాలని వెల్లడించారు. ఎన్నికల సందర్భంగా నగదు ప్రవాహంపై కూడా దృష్టి పెట్టామని తెలిపారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో రూ.3400 కోట్ల డబ్బును సీజ్ చేసినట్లు గుర్తు చేశారు. ఐటీ, ఈడీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలతో కలిసి నిఘా పెట్టినట్లు పేర్కొన్నారు. ఎన్నికల్లో చిన్న పిల్లలను భాగం చేయడాన్ని ఎట్టి పరిస్థితుల్లో అనుమతించేది లేదని స్పష్టం చేశారు. 2019 సార్వత్రిక ఎన్నికలకు ఆ ఏడాది మార్చి 18 వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. దేశవ్యాప్తంగా 2019 లో మొత్తం 7 విడతల్లో పోలింగ్ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు మరికొన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీతోపాటు లోక్‌సభకు ఎన్నికలు జరిగాయి. మొదటి విడతలోనే ఏప్రిల్ 11 వ తేదీన ఆంధ్రప్రదేశ్‌లో పోలింగ్ నిర్వహించారు. దేశంలో 7 విడతల్లో పోలింగ్ పూర్తయిన తర్వాత 2019 మే 23 వ తేదీన ఎన్నికల ఫలితాలను విడుదల చేశారు.



## మేం సిద్ధం..

న్యూఢిల్లీ, మార్చి 16 (ప్రభాత ఉదయం): సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. కేంద్ర ఎన్నికల సంఘం కాసేపటి క్రితమే లోక్ సభ ఎన్నికలతో పాటు ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. దీంతో దేశవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చేసింది. మొత్తం 7 దశల్లో లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా ఆసక్తికర ట్వీట్ చేశారు. ఈ విషయమై మోదీ ట్వీట్ చేస్తూ.. 'ప్రజాస్వామ్యంలో ఇది అతిపెద్ద పండగ. కేంద్ర ఎన్నికల కమిషన్ 2024 లోక్ షభ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. మేం ఎన్నికలకు సిద్ధంగా ఉన్నాము. సుపరిపాలనతో పాటు పలు రంగాల్లో సేవలను అందించడంలో మా ట్రాక్ రికార్డ్ ఆధారంగా ప్రజల వద్దకు వెళ్తున్నాము' అంటూ మోదీ వచ్చే ఎన్నికలపై ధీమా వ్యక్తం చేశారు.




## బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు షాక్

మొదటి పేజీ తరువాయి...

ఈడీ పేర్కొంది. అటు, ఈ కేసులో తనను కావాలనే ఇరికించారని కవిత అన్నారు. శనివారం ఉదయం కోర్టుకు తీసుకెళ్తున్న సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. 'ఈడీ నన్ను చట్ట విరుద్ధంగా అరెస్ట్ చేసింది. లిక్కర్ కేసు ఓ కట్టుకథ. అక్రమ అరెస్టుపై న్యాయ పోరాటం చేస్తాను.' అని పేర్కొన్నారు. తనను శుక్రవారం నుంచి న్యాయవాదులతో మాట్లాడనివ్వలేదని.. మధ్యాహ్నం 2 గంటలకు తీసుకొస్తామని 11 గంటలకు తీసుకొచ్చారని అన్నారు. ఈడీ అధికారులు అధికార దుర్వినియోగం చేశారని కవిత తరఫు లాయర్లు వాదించారు. సెప్టెంబర్ 15న సుప్రీంకోర్టులో ఇచ్చిన మాటను ఉల్లంఘించారని.. తదుపరి విచారణ జరిగే వరకూ ఎలాంటి చర్యలు తీసుకోమని చెప్పారని గుర్తు చేశారు. కానీ అలా జరగలేదని.. మహిళను ఈడీ కోర్టుకు పిలవడంపై కేసు పెండింగ్ లో ఉందని పేర్కొన్నారు. ఓపెన్ కోర్టులో ఇచ్చిన స్టేట్మెంట్ కు ఈడీ కట్టుబడి లేదంటూ కోర్టుకు తెలిపారు. ఇరువర్గాల సుదీర్ఘ వాదనలు విన్న న్యాయస్థానం కవితను ఈడీ కస్టడీకి అప్పగిస్తూ ఆదేశాలిచ్చింది.

## కేజ్రీవాల్‌కి ఊరట

న్యూఢిల్లీ, మార్చి 16 (ప్రభాత ఉదయం): ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసుకు సంబంధించి ఢిల్లీ సీఎం 'అరవింద్ కేజ్రీవాల్'కు రూ.15,000 బెయిల్ బాండ్, రూ.లక్ష పూచీకత్తుపై ఢిల్లీలోని రూస్ అవెన్యూ కోర్టు శనివారం బెయిల్ మంజూరు చేసింది. ఈడీ ఎనిమిది సార్లు సమన్లు జారీ చేసినప్పటికీ విచారణకు హాజరు కాకపోవడంతో.. దర్యాప్తు సంస్థ ఢిల్లీ కోర్టు మెట్లెక్కింది. కోర్టుకు హాజరైన సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు న్యాయస్థానం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. న్యాయస్థానం తనకు బెయిల్ మంజూరు చేసిన తరువాత న్యాయమూర్తి అనుమతితో కోర్టు నుంచి కేజ్రీవాల్ వెళ్లిపోయారు. ఢిల్లీ ఇప్పుడు రద్దు చేసిన ఎక్సైజ్ పాలసీకి సంబంధించి మనీలాండరింగ్ కేసులో ఆప్ అగ్రనేతలు.. ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా, రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్‌లను ఈడీ అరెస్టు చేసింది. ఈడీ చార్జ్ షీట్లలో కేజ్రీవాల్ పేరు పలుమార్లు చోటు చేసుకుంది. ఎక్సైజ్ పాలసీ ముసాయిదా రూపకల్పన సమయంలో ఈ కేసులో నిందితులు ముఖ్యమంత్రితో టచ్‌లో ఉన్నారని ఏజెన్సీ తెలిపింది.

## బీఆర్ఎస్‌తో కలిసి నడుస్తా

మొదటి పేజీ తరువాయి...

కేసీఆర్‌ను ఆయన నివాసంలో కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలోని బహుజన ప్రయోజనాల కోసమే రాజీనామా నిర్ణయం తీసుకున్నానని, తాను ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గనని అన్నారు. అందరితో చర్చించాక భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటానని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు. 'భవిష్యత్‌లో కేసీఆర్, బీఆర్ఎస్‌తో కలిసి నడుస్తా. బీఎస్పీకి చాలా బాధతో రాజీనామా చేశా. పొత్తుపై కేసీఆర్‌కు మాట ఇచ్చా. ఆ మాట తప్పను. ప్రస్తుత రాజకీయ పరిణామాలపై కేసీఆర్‌తో సుదీర్ఘంగా చర్చించా. తెలంగాణ ప్రయోజనాల కోసమే బీఎస్పీని వీడాను. నా అనుచరులు, అభిమానులతో చర్చలు జరిపిన అనంతరం రాజకీయ నిర్ణయం ప్రకటిస్తా. గత తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో నేను బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేయడమే కాకుండా 107 మంది అభ్యర్థులను బరిలోకి దింపా. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ కాకుండా ప్రాంతీయ పార్టీలతో పొత్తులు పెట్టుకోవాలని అనుకున్నాం. అధిష్టానంతో చర్చించిన తర్వాతే బీఆర్ఎస్, బీఎస్పీ పొత్తుపై నిర్ణయం తీసుకున్నాం. బీఎస్పీకి కేసీఆర్ పొత్తులో భాగంగా రెండు సీట్లు కేటాయించారు. దీనికి బీఎస్పీ అగ్ర నాయకత్వం కూడా అంగీకరించింది' అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. బీఆర్ఎస్. బీఎస్పీ పొత్తు పెట్టుకోవడం బీజేపీకి నచ్చలేదని, అందుకే బీఎస్పీ అగ్రనాయకత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి పొత్తును రద్దు చేయించిందని ఆర్ఎస్పీ ఆరోపించారు. ఇది ఇష్టం లేకనే పార్టీని వీడినట్లు తెలిపారు. గతంలో తాను ఐపీఎస్ ఆఫీసర్‌గా దేశానికి ఎంతో సేవ చేశానని తెలిపారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడిగా అవకాశం ఇచ్చినందుకు బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతికి ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. పార్టీని బలోపేతం చేసేందుకు ఎంతో కృషి చేశానని, 4 వేల గ్రామాల్లో పర్యటించి పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లానని స్పష్టం చేశారు. మాయావతి సూచన మేరకు నల్లగొండ సభలో బీఎస్పీలో చేరానని, వెంటనే రాష్ట్ర అధ్యక్షుడిగా అవకాశం ఇచ్చారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చెప్పారు. పొత్తు ఒప్పందంలో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా తాను ముందుకు సాగాల్సిందేనని, కష్టసుఖాలు పంచుకోవాల్సిందేనని ఆర్ఎస్పీ తెలిపారు. బీజేపీ కుట్రలకు భయపడి తాను నమ్ముకున్న విలువలకు తిలోదకాలు ఇవ్వలేదనని, తన ప్రస్థానాన్ని ఆపలేనని అన్నారు. కాగా కొద్దిరోజుల క్రితం కేసీఆర్ ఇంటికి వెళ్లిన ఆర్ఎస్పీ పొత్తులపై చర్చించారు. అనంతరం కేసీఆర్, ఆర్ఎస్పీ కలిసి పొత్తుపై ప్రకటన చేశారు. బీఎస్పీకి నాగర్ కర్నూల్, హైదరాబాద్ టికెట్ ఇచ్చేందుకు కేసీఆర్ ఓకే చెప్పారు. కానీ ఏమైందో ఏమో కానీ బీఆర్ఎస్‌తో పొత్తుపై బీఎస్పీ అగ్రనాయకత్వం వెనక్కి తగ్గింది.



## 'తెలంగాణ ప్రజల కలలను బీఆర్ఎస్, కాంగ్రెస్ ధ్వంసం చేశాయి'

మొదటి పేజీ తరువాయి...

నినాదం వారు ఇచ్చినా.. పేదల జీవితాల్లో ఎలాంటి మార్పు రాలేదు. తెలంగాణను గేట్ వే ఆఫ్ సౌత్ అంటారు. గత పదేళ్లలో రాష్ట్ర అభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం కృషి చేస్తోంది. 140 కోట్ల మంది భారతీయులు నా కుటుంబం. 87 లక్షల మంది ఆయుష్మాన్ భారత్ కింద లబ్ధి పొందారు. ఈసారి ఎన్డీయేకు 400 సీట్లు రాబోతున్నాయి. తెలంగాణలోనూ వేగవంతమైన అభివృద్ధిని తీసుకురావాలి. కేంద్ర పథకాలతో అట్టడుగు వర్గాల వారికి ఎంతో మేలు జరిగింది. వచ్చే లోక్ సభ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు గెలిపించాలి.' అని మోదీ ప్రజలకు పిలుపునిచ్చారు. దేశంలో అన్ని సామాజిక వర్గాలకు న్యాయం చేసింది బీజేపీయేనని ప్రధాని మోదీ అన్నారు. 'బీజేపీని గెలిపిస్తే ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తాం. మీ అభివృద్ధి కోసం రాత్రి, పగలూ పని చేస్తాను. మా పార్టీ అభ్యర్థులను అధిక సంఖ్యలో గెలిపిస్తే కాంగ్రెస్ ఆటలు ఇక సాగవు. కాంగ్రెస్ పాలన అంతా మోసం, దోపిడీ మాత్రమే. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూసింది. బీజేపీకి పూర్తి మెజార్టీ ఇచ్చిన తర్వాతే దేశంలో మార్పు వచ్చింది. నేను నిరంతరం ప్రజల కోసమే పని చేస్తున్నా. ఆర్టికల్ 370, అయోధ్య రామాలయ నిర్మాణం వంటివి కొన్ని ఉదాహరణలు.' అని పేర్కొన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కాకముందే దేశ ప్రజలు తీర్పు ఇచ్చేశారని.. మూడోసారి ప్రధాని మోదీయేనని నిర్ణయించారని అన్నారు. 'మల్కాజిగిరిలో శుక్రవారం జన ప్రవాహాన్ని చూశాను. యువకులు, మహిళలు, వృద్ధులు ఇలా చాలా మంది రోడ్లపై నిల్చుని బీజేపీకి మద్దతు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పై ప్రజల వ్యతిరేకతను చూశాను. మళ్లీ బీజేపీని అధికారంలోకి తెచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. గత పదేళ్లలో కేంద్ర పథకాలు తెలంగాణ ప్రజలకు చేరకుండా అవినీతి, అబద్ధాల బీఆర్ఎస్, కాంగ్రెస్ అడ్డుకున్నాయి. కాంగ్రెస్ వారు గిరిజన రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఓడించాలని చూశారు. తెలంగాణలో ఎస్సీ వర్గానికి చెందిన ప్రస్తుత డిప్యూటీ సీఎంను కింద కూర్చోబెట్టి అవమానించారు. ఇక్కడ ఎక్కువ మంది బీజేపీ ఎంపీలను గెలిపిస్తే తెలంగాణ ప్రజల ఆకాంక్ష నాకు ఢిల్లీలో తెలుస్తుంది. ఈసారి బీజేపీకి రెండంకెల ఎంపీ సీట్లివ్వండి.' అని మోదీ పిలుపునిచ్చారు.

## 'కవిత అరెస్టుపై కేసీఆర్ మౌనం ఎందుకు?'

మొదటి పేజీ తరువాయి...

అన్నారు. 'మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి' అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్లామని.. ప్రస్తుతం తాము ప్రజల్లోనే ఉన్నామని చెప్పారు. 'ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించేలా ప్రజావాణిని అమలు చేస్తున్నాం. అధికారం చేపట్టిన 24 గంటల్లోనే 2 హామీలు అమలు చేశాం. రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత కరెంట్, ఇందిరమ్మ ఇండ్లు పథకాలనూ ప్రారంభించాం. ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇళ్లు మంజూరు చేస్తున్నాం. 3 నెలల్లోనే 30 వేల ఉద్యోగాలు ఇచ్చాం. బీఆర్ఎస్ హయాంలో అవినీతికి అడ్డాగా మారిన టీఎస్ పీఎస్సీని.. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రక్షాళన చేపట్టాం. ఆరు గ్యారెంటీల అమలే లక్ష్యంగా పని చేస్తున్నాం. డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపుతున్నాం. పన్ను ఎగవేతదారులపై కఠినంగా వ్యవహరించి.. ఆదాయాన్ని స్థిరీకరించాం. గతంలో సీఎం దర్శనమే భాగ్యం అన్నట్లుగా ఉండేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు.' అని రేవంత్ పేర్కొన్నారు. వంద రోజుల్లో చాలా చేశామని.. ఇంకా చేయాల్సింది చాలా ఉందని సీఎం రేవంత్ అన్నారు. గత పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం వందేళ్లకు సరిపడా విధ్వంసం చేసిందని విమర్శించారు. రాష్ట్రాన్ని పూర్తిగా అప్పుల ఊబిలోకి నెట్టారని మండిపడ్డారు. 'ప్రగతి భవన్ ను ప్రజా భవన్ గా మార్చి.. సచివాలయంలోకి సాధారణ ప్రజలు వచ్చేందుకు స్వేచ్ఛ ఇచ్చాం. భేషజాలకు పోకుండా ప్రధాని, కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్ర హక్కుగా రావాల్సిన వాటిని రాబట్టగలిగాం. హంగులు లేకుండా పాలన సాగుతోంది. వైబ్రెంట్ తెలంగాణ 2050తో ముందుకు వెళ్తున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని బీఆర్ఎస్, బీజేపీ నేతలు అంటున్నారు. మమ్మల్ని ఇబ్బంది పెట్టాలని చూస్తే బీఆర్ఎస్ లో ఎవ్వరూ మిగలరు. ఎలాంటి ఇబ్బంది వచ్చినా ధైర్యంగా ఎదుర్కొంటాం.' అని రేవంత్ స్పష్టం చేశారు.

## సీఏఏ అమలు నిలిపివేయాలి

### సుప్రీంకోర్టును ఆశ్రయించిన అసదుద్దీన్ ఒవైసీ

హైదరాబాద్, మార్చి 16 (ప్రభాత ఉదయం): పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ), రూల్స్-2024 అమలును నిలిపివేయాలని కోరుతూ ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పౌరసత్వ చట్టం-1955లోని సెక్షన్ 6బీ (పౌరసత్వ సవరణ) చట్టం 2019 ప్రకారం పౌరసత్వ హోదా కల్పించాలని కోరుతూ దాఖలైన దరఖాస్తులను ప్రభుత్వం విచారణకు స్వీకరించరాదని ఒవైసీ స్పష్టం చేశారు. సీఏఏను ఎన్పీఆర్ (నేషనల్ పాపులేషన్ రిజిస్టర్), ఎన్ఆర్సీ (నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్)తో కలిపి చూడాలని ఒవైసీ పేర్కొన్నారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ నుంచి వచ్చిన హిందువులు, సిక్కులకు పౌరసత్వం ఇవ్వడానికి తాను వ్యతిరేకం కాదని తెలిపారు. "ఈ చట్టాన్ని చేయడానికి కారణం ఉంది. ఒక వేళ భవిష్యత్తులో మీరు (ప్రభుత్వం) దేశంలో ఎన్పీఆర్, ఎన్ఆర్సీ చేసినప్పుడు భారతదేశంలోని 17 కోట్ల మంది ముస్లింలను నిరాశ్రయులను చేయాలనుకుంటున్నారు." అని తెలిపారు. హైదరాబాద్ ప్రజలు సీఏఏకు వ్యతిరేకంగా ఓటు వేసి ఎన్నికల్లో బీజేపీని ఓడిస్తారని ఒవైసీ అన్నారు. కాగా.. 2014 డిసెంబర్ 31 కంటే ముందు పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ నుండి భారతదేశానికి వచ్చిన ముస్లిమేతర వలసదారులకు పౌరసత్వాన్ని వేగవంతం చేయడానికి సీఏఏను కేంద్ర ప్రభుత్వం 2019లో తీసుకొచ్చింది. ఈ చట్టానికి రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. అయితే నాలుగు సంవత్సరాల తరువాత కేంద్రం మార్చి 11న దానిని నోటిఫై చేసింది. దీంతో ఆ చట్టం గత సోమవారం నుంచి అమల్లోకి వచ్చింది. ఈ చట్టం ప్రకారం పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ దేశాల నుంచి వచ్చిన ముస్లిమేతర శరణార్థులు పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. దీని కోసం కేంద్ర ప్రభుత్వం ఓ వెబ్ సైట్ ను కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది.

## కవిత భర్త అనిల్‌కు ఈడీ నోటీసులు



న్యూఢిల్లీ, మార్చి 16 (ప్రభాత ఉదయం): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్ట్ అయిన బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత భర్త అనిల్ కు ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నోటీసులు జారీ చేసింది. ఆయనతో పాటు పీఆర్ వో రాజేష్, మరో ఇద్దరు సహాయకులకు కూడా నోటీసులు జారీ చేశారు. వారి ఫోన్లను ఇప్పటికే స్వాధీనం చేసుకున్నారు. వీరంతా సోమవారం ఈడీ ఎదుట హాజరుకావాలని ఆదేశించారు. ముడుపుల సొమ్ముతో కవిత భర్త భూములు కొన్నారని ఈడీ ఆరోపించింది. ఈ భూముల విలువ సుమారు రూ.5.5 కోట్లు ఉంటుందని పేర్కొన్నారు. కాగా.. ఇప్పటికే కల్వకుంట్ల కవిత ఈడీ అదుపులో ఉన్నారు. ఆమెను శనివారం ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపర్చారు. దీంతో ఆమెకు కోర్టు 7 రోజుల పాటు కస్టడీ విధించింది. మార్చి 23వ తేదీన తిరిగి కోర్టులో హాజరుపర్చాలని కోర్టు ఈడీని ఆదేశించింది. కాగా.. ఎమ్మెల్సీ కవితకు హైబీపీ ఉందని ఆమె లాయర్ కోర్టుకు వెల్లడించారు. గతంలో ఎప్పుడూ కూడా ఇంత స్థాయిలో బీపీ పెరగలేదని వెల్లడించారు. ఆమె అనారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని కస్టడీ నుంచి ఉపశమనం ఇవ్వాలని కోర్టును కోరారు. కానీ దానిని కూడా కోర్టు నిరాకరించింది. ఈడీ కస్టడీలో ఉన్న సమయంలో ఆమెకు ఇంటి నుంచి భోజనం, దుస్తులు, మెడిసిన్ అందించవచ్చని లాయర్ కు కోర్టు సూచించింది. అయితే కవిత కోరిన కొన్ని మినహాయింపులకు కూడా కోర్టు అంగీకారం తెలిపింది. ప్రతీ రోజూ ఫ్యామిలీ మెంబర్స్ ను, లాయర్స్ ను కలిసేందుకు అవకాశం ఇచ్చింది. అనంతరం ఆమెను ఈడీ తమ కార్యాలయానికి తీసుకెళ్లింది. కోర్టుకు వెళ్లే ముందు కవిత మీడియాతో మాట్లాడుతూ.. తనను అక్రమంగా ఈడీ అధికారులు అరెస్ట్ చేశారని ఆరోపించారు. మద్యం పాలసీ కుంభకోణం కేసులో తనను అరెస్టు చేయడం చట్టవిరుద్ధమని అన్నారు.

## కంటోన్మెంట్ ఉపఎన్నికకూ షెడ్యూల్

మొదటి పేజీ తరువాయి...

తెలిపారు. మార్చి 16వ తేదీ అభిమానులు, కార్యకర్తల సమావేశం తరువాత ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె ఈ విషయాన్ని వెల్లడించారు. తన తండ్రిని, సోదరిని గెలిపించినట్లే తనని కూడా ఆశీర్వదించాలని కోరారు. నాన్న సాయన్నకు మద్దతుగా నిలిచిన ప్రజలు లాస్య నందితను సైతం భారీ మెజార్టీతో గెలిపించారన్నారు. అయితే దురదృష్టవశాత్తు రోడ్డు ప్రమాదంలో మన యువ లీడర్ ను కోల్పోయామన్నారు. అయితే ఉప ఎన్నికల బరిలో తాను నిల్చోవాలని స్థానిక లీడర్లు, ప్రజలు కోరుతున్నారన్నారు. వాళ్లందరి మద్దతుతో తాను ఈ ఉప ఎన్నికల్లో పోటీ చేస్తున్నానన్నారు. బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్‌ను త్వరలో ఇదే విషయమై కలుస్తామన్నారు. ఫిబ్రవరి 23న హైదరాబాద్‌లోని అవుటర్ రింగు రోడ్డు(ఓఆర్ఆర్) పై జరిగిన రోడ్డు ప్రమాదంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతి చెందారు. దీంతో లోక్ సభ ఎన్నికలతో పాటుగా కంటోన్మెంట్ కు ఈసీ ఉప ఎన్నిక నిర్వహించనుంది. బీఆర్ఎస్ నివేదితకి టికెట్ ఇస్తుందా లేదా అన్నదానిపై ఇంకా క్లారిటీ రాలేదు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో 1994 నుంచి 2018 వరకు మధ్యలో 2009 ఎన్నికలు మినగా.. మిగిలిన ఐదు సార్లు ఎమ్మెల్యేగా జి సాయన్న విజయం ఢంకా మోగించారు. 1994, 99, 2004 ఎన్నికల్లో టీడీపీ తరఫున బరిలో దిగిన సాయన్న హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసి.. రికార్డు సృష్టించారు. ఇక తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా 2014లో టీడీపీ తరఫున బరిలోకి దిగి గెలుపొందారు. ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరిన సాయన్న.. 2018లోనూ తన విజయ పరంపరను కొనసాగించారు. అయితే.. అనారోగ్య కారణాలతో సాయన్న 2023, ఫిబ్రవరి 19న హైదరాబాదులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.

సాయన్న మృతి త్వరాత.. ఆయన వారసత్వాన్ని కొనసాగించాలని స్థానిక నేతలు, అభిమానుల విజ్ఞప్తి మేరకు బీఆర్ఎస్ అధిష్ఠానం 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన కుమార్తె లాస్య నందితకు టికెట్ ఇచ్చింది. బీటెక్ చదివిన లాస్యనందిత.. గెలిచి తన తండ్రి పేరును నిలబెట్టారు. అయితే.. ఎమ్మెల్యేగా గెలిచి మూడు నెలలు గడవకముందే.. ఘోర రోడ్డు ప్రమాదంలో.. అత్యంత విషాదకరంగా లాస్యనందిత తుదిశ్వాస విడిచారు. దీంతో.. ఇప్పుడు తన తండ్రి వారసత్వాన్ని



కొనసాగించేందుకు దివంగత నేత సాయన్న ఇంకో కుమార్తె, లాస్య నందిత సోదరి నివేదిత పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు.

## బిఆర్ఎస్‌ను ఎదుర్కొనలేకనే కేంద్ర ప్రభుత్వం

# బెదిరింపు చర్యలకు పాల్పడుతుంది



ధర్నాలో మాట్లాడుతున్న మహేశ్వరం ఎమ్మెల్యే తబితా రెడ్డి



కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్గరికి చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

### మాజీ మంత్రి సబితా రెడ్డి

మహేశ్వరం, మార్చి16(ప్రభాత ఉదయం) తెలంగాణ రాష్ట్రంలో భారత్ రాష్ట్ర సమితి ని ఎదుర్కొనలేకనే బిజెపి వక్ర మార్గాల ద్వారా అరెస్టులకు పాల్పడుతుందని మాజీ మంత్రి, మహేశ్వరం శాసన సభ్యురాలు పి సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. శనివారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టును నిరసిస్తూ బి ఆర్ ఎస్ పార్టీ పిలుపు మేరకు మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో మాజీ మంత్రి వర్యులు,మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ... ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ అక్రమం అన్నారు.ముందు సాక్షిగా పిలిచి,అనంతరం ఇటీవలే నిందితురాలుగా చేర్చి,ఎన్నికల నోటిఫికేషన్ కు ఒక రోజు ముందు అరెస్ట్ చేయటం రాజకీయ కుట్ర అన్నారు.ఇదే కేసు విషయంలో సుప్రీంకోర్టులో ఈ నెల 19 న వాయిదా ఉండగా హడావుడి అరెస్ట్ ఎందుకు చేశారన్నారు.అరెస్ట్ చేయవద్దని కోర్టు చెప్పిన నిబంధనలు పాటించలేదన్నారు.వేల కోట్లు దోచుకొని దేశం విడిచి పారిపోయిన వారిని వదిలిపెట్టి, కేసుతో ఎలాంటి సంభంధం లేకున్నా ఒక ఆడబిడ్డను మోడీ ప్రభుత్వం అరెస్ట్ చేసిందన్నారు.కేసీఆర్ ని నేరుగా ఎదుర్కొనలేక మోడీ ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను ప్రయోగిస్తుందన్నారు,అక్రమ కేసులు బనాయిస్తుందన్నారు.న్యాయ వ్యవస్థ మీద మాకు ప్రగాఢ నమ్మకం ఉందన్నారు.ఎప్పటికైనా న్యాయమే గెలుస్తుందని కేవలం రాజకీయ కోణంలో కేసు నమోదు చేశారన్నారు. .నల్లధనం తెచ్చి ప్రతి ఒక్కరి అకౌంట్ లో 15 లక్షలు ఇస్తానని,ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మొత్తం 20 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉండగా కొత్తవి ఇవ్వక పోగ,ప్రభుత్వ రంగ సంస్థలు ప్రయివేటు పరం చేస్తూ ఉన్న ఉద్యోగాలు తీసేశారన్నారు.నల్లా చట్టాలు వ్యతిరేకించినందుకు, మోటర్లకు మీటర్లు గొంతులో ప్రాణము ఉన్నంత వరకు పెట్టబోనని కేసీఆర్ చెప్పినందుకు కక్ష పెంచుకొని,నాగ్డు కేంద్రం రాష్టానికీ ఒక రూపాయి కూడ ఇవ్వలేదన్నారు.కుటుంబాన్ని ఇబ్బంది పెట్టాలని కవితగారిపై కేవలం ఫోన్ల సంభాషణ చూపెడుతూ అక్రమంగా కేసు పెట్టి అరెస్ట్ చేశారన్నారు.కవిత వెంట బీఆర్ఎస్ కుటుంబం,తెలంగాణ ప్రజాలున్నారన్నారు.అందరూ రానున్న ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థులను గెలిపించుకుని సత్తా చాటాలన్నారు. ఈ ధర్నాలో బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు,మాజీ ప్రజాప్రతినిధులు,పార్టీ అధ్యక్షులు, కార్యవర్గాలు, నాయకులు,అనుబంధ సంఘాల అధ్యక్షులు, నేతలు,కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మోడీ,కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.





## అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధి మినీ ఇండియా

### సిబ్బంది కొరతతో ఇబ్బందులు

### సమస్యాత్మక ప్రాంతాలకు అనుగుణంగా సిబ్బంది పెంచాలి

రాజేంద్రనగర్, మార్చి16(ప్రభాత ఉదయం) సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అత్తాపూర్ పోలీస్ స్టేషన్ లోని సిబ్బంది కొరత తో అధికారులు, సిబ్బందికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పోలీస్ స్టేషన్ పరిధి మినీ ఇండియాగా దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రజలు నివసిస్తున్నారు. రెండు సామాజిక వర్గాల ప్రాంతాలు పక్కపక్కనే ఉండటంతో సమస్యాత్మక ప్రాంతంగా నిలిచింది. అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న 103 మంది రౌడీషీటర్లు తోపాటు వివిధ సామాజిక మతాల ప్రజలు నివసిస్తున్నారు. సామాజిక ప్రజలు తమ ప్రాంతాలలో కలిసి ఉంది పండగలు జరుపుకుంటారు. ఆయా సామాజిక వర్గ ప్రజలు తమ సాంప్రదాయం ప్రకారం భారీగా ర్యాలీలు నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది. అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉంటుంది కానీ సిబ్బంది కొరతతో పెట్రోలింగ్, మొబైల్ ఒక్కటే ఉండడం అదేవిధంగా ప్రతి బస్తీలో మొబైల్ వెహికిల్ తో పాటు ఇద్దరు కానిస్టేబుల్ ఉంటే బాగుంటుందని స్థానికులు తెలుపుతున్నరు. సమస్యాత్మక ప్రాంతాలు ఎక్కువగా ఉండటంతో నేరాలను అదుపులోకి చేయడానికి సిబ్బంది సరిపోక ఉన్న సిబ్బందితో అత్తాపూర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది సతమతమవుతోంది. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో నేషనల్ పోలీస్ అకాడమీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు ఉండటంతో పాటు అంతర్జాతీయ విమానాశ్రయానికి దారి కావటంతో ప్రతిరోజు ప్రముఖులు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రముఖుల రాకపోకలను దృష్టిలో పెట్టుకొని అధికారులు బందోబస్తు కూడ ఏర్పాటు చేయవలసిన అవసరం ఉంటుంది. పోలీస్ స్టేషన్లో సరిపడా సిబ్బంది లేకపోవడంతో బందోబస్తుకు ఎవరిని ఎటు పంపాలో తెలియని పరిస్థితి నెలకొందని పోలీస్ స్టేషన్ అధికారులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా పార్లమెంట్ ఎన్నికల సమయం వచ్చింది . ఎలక్షన్ల భాగంగా చెక్ పోస్ట్ లతోపాటు ఎన్నికల బందోబస్తు కూడా ఏర్పాటు చేసుకోవాలి పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఉన్న అత్తాపూర్ పోలీస్ స్టేషన్ సిబ్బందిని పెంచితే దాదాపుగా ప్రతి కాలనీలలో మొబైల్ కానిస్టేబుల్ లతోపాటు తిరిగితే సమస్యలు ఉండవని స్థానికులు అంటున్నారు. స్టేషన్ పరిధిలో ప్రస్తుతం 30 మందికి పైగా సిబ్బందితోనే విధులు నిర్వహిస్తున్నారు. సిబ్బంది కొరత కారణంగా పని భారం, సమయం కూడ కేటాయించి విధులు నిర్ణయించలేని పరిస్థితి ఉందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీస్ ఉన్నతాధికారులు అత్తాపూర్ పోలీస్ స్టేషన్ క్షేత్రస్థాయిలో పరిశీలించి సిబ్బందిని ఉంచాలని కోరుతున్నారు.





జాతీయ లోక్ అదాలత్ లో పాల్గొన్న న్యాయ మూర్తులు

## రాజేంద్రనగర్ కోర్టులో మెగా లోక్ అదాలత్

బుద్వేల్, మార్చి16(ప్రభాత ఉదయం) : రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని రాజేంద్రనగర్ మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 11 వ అదనపు న్యాయమూర్తి నీలిమ అన్నారు. శనివారం రాజేంద్రనగర్ లో మెగా లోక్ అదాలత్ కార్యమాన్ని న్యాయమూర్తి నీలిమ ఆద్వర్యంలో నిర్వహించారు, ఇందులో భాగంగా మ్మొత్తం 6,220 కేసులను పరిష్కరించారు. ఇందులో రాజీపడిన కేసులు 177, అడ్మిషన్ కేసులు 317, డ్రంకన్ డ్రైవ్ కేసులు 1, 935, ఇ-పెట్టి కేసులు 3503, విద్యుత్ చౌర్యం కేసులు 283 లను పరిష్కరించారు, ఈ కార్యక్రమంలో 12వ అదనపు న్యాయమూర్తి రాజ్ కిరణ్, 13వ న్యాయమూర్తి అంకిత్ సర్వ, స్పెషల్ కోర్టు న్యాయమూర్తి రవి కుమార్, %ూౌా%లు శీనయ్య, ప్రవీణ్ నాయక్, సంగీత, బార్ అసోసియేషన్ అధ్యక్షులు హరిప్రసాద్ రెడ్డి, కార్యదర్శి రామకృష్ణ గౌడ్, లోక్అదాలత్ సభ్యులు వెంకట్ రెడ్డి, సుదర్శన్, సుధాకర్ రెడ్డి, సుజాత, వరప్రసాద్, శ్రీనివాసులు, కోర్టు సిబ్బంది వెంకటరంగారెడ్డి, నరేష్ గౌడ్, సంబంధిత ఠాణాల పోలీసులు పాల్గొన్నారు.



రాజేంద్రనగర్ బస్తీ కాంగ్రెస్ అధ్యక్షుడుగా నియమితులైన ఎం. శ్రీకాంత్‌కు నియామక పత్రాన్ని అందచేస్తున్న కోరని బాల్ రాజ్, బొక్క ప్రభాకర్ రెడ్డి లు

## రాజేంద్రనగర్ కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఎం. శ్రీకాంత్

బుద్వేల్, మార్చి16(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ బస్తీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎం శ్రీకాంత్ నియమితులైనారు. ఈ మేరకు పార్టీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కోరని బాల్ రాజ్, రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు బొక్క ప్రభాకర్ రెడ్డి , బుద్వెల్ విలేజ్ ప్రెసిడెంట్ కోరని శ్యామ్ అధ్వర్యంలో శ్రీకాంత్ కు నియామక పత్రాన్ని అందచేశారు. ఈ కార్యక్రమం లో నాయకులు కరణం నారాయణ ముదిరాజ్, పత్యర రాజు, మన్నే నర్సింగ్ రావు, దానయ్య, నారమొని రాధ కృష్ణ, రాములు, డుంబాల ఝాన్సి రాణి, ఎస్. నాగరాజు, శివ కుమార్, అర్జున్, మాగణి మహేష్, చెరుకుల రవి, పురుగుల చంద్రకాంత్, వినోద్, రెబెల్ సాయి రఫీక్, శివ శంకర్, అనూప్, సందీప్, మన్నే రాజు,సాయి కుమార్, యువ నాయకులు శంకర్ యాదవ్, సాయి బాబా, వంశీ , నిఖిల్, మహేష్, మనోహర్, దుర్గ రావు, గడ్డం చింటు, అన్నెల మహేష్, దినేష్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల వార్షికోత్సవంలో విద్యార్థులతో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

## విద్యతోనే సమాజాభివృద్ధి: కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

రాజేంద్రనగర్, మార్చి16(ప్రభాత ఉదయం) విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని అందుకోసం తల్లిదండ్రులు పిల్లలను విద్యావంతులను చేయాల్సిన బాధ్యత ఉందని మైలార్ దేవుపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీ లోని విశ్వశాంతి గ్లామర్ స్కూల్ వార్షికోత్సవానికి కార్పొరేటర్ తోకల శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు , అయోధ్య నృత్య ప్రదర్శన , స్కిట్స్ ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి ప్రసంగిస్తూ... విద్య ప్రాముఖ్యాన్ని తెలియ చేస్తూ, విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని పేరెంట్స్ సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో, స్కూల్ కరస్పాండెంట్ కె.కరుణాకర్ , డైరెక్టర్లు జెన్నా విజయచందర్ , కె. క్రాంతి కిరణ్ , ఉపాధ్యాయులు , పేరెంట్స్ పాల్గొన్నారు.



కోరని శ్యామ్ కు నియామక పత్రాన్ని అందచేస్తున్న కస్తూరి నరేందర్ ముదిరాజ్

## బుద్వేల్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా కోరని శ్యామ్

బుద్వేల్, మార్చి16(ప్రభాత ఉదయం) : బుద్వేల్ బస్తి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కోరని శ్యామ్ నియమితులైనారు. శనివారం బుద్వేల్ లో జరిగిన పార్టీ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ కస్తూరి నరేందర్ ముదిరాజ్, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కోరని బాలరాజ్, రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు బొక్క ప్రభాకర్ రెడ్డి ల చేతుల మీదుగా కోరని శ్యామ్ కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కస్తూరి నరేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ బుద్వేల్ లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నూతన కమిటీ సభ్యులు కృషి చేయాలన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించుకోవడానికి కార్యకర్తలంతా కష్టపడి పని చేయాలన్నారు.

**నూతన కమిటీ :**

బుద్వేల్ బస్తి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కోరని శ్యామ్, ఉపాధ్యక్షులుగా ఏ నవీన్ కుమార్ , డి కిరణ్ కుమార యాదవ్ , ఈగ రమేష్, ప్రధాన కార్యదర్శిగా కే వినోద్ చారి, సంయుక్త కార్యదర్శులుగా కె. ధనరాజ్, ఎం ఆంజనేయులు, కోశాధికారిగా కోరని నరేందర్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడుగా జి చందు, కార్యదర్శిగా ఎండి సమీర్ , కార్య నిర్వాహక కార్యదర్శిగా కే నాగరాజు, పెంద్యాల శ్రీధర్, సీహెచ్ అమర్ నాథ్ , ఎం నరసింహ , ఎన్ సురేష్ , కె. రాజ్ కుమార్ , సంపత్ కుమార్ భక్త వరి కుమార్, పి రాజు, ఏ రాజేందర్ కుమార్ , కోరని పాండు , మంద హరికుమార్, జి సి ప్రకాష్ , పి బాల్ రెడ్డి, జి. యాదగిరి లు నియమితులైనారు.

# ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ అక్రమం

### బిఆర్ఎస్ శంషాబాద్ మండల అధ్యక్షులు కోడిగంటి చంద్రారెడ్డి

శంషాబాద్, మార్చి 16,(ప్రభాత ఉదయం ) టిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అక్రమంగా అరెస్టు చేయడం అప్రజాస్వామిక చర్య అని శంషాబాద్ మండల టిఆర్ఎస్ అధ్యక్షుడు కొడిగంటి చంద్ర రెడ్డి ఆరోపించారు. శనివారం టిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అక్రమ అరెస్టుకు నిరసనగా శంషాబాద్ మండల కేంద్రంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు ఆందోళన చేపట్టారు. శంషాబాద్ మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొడిగంటి చంద్రారెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద పార్టీ నాయకులు కార్యకర్తలు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ... కుమ్ముక్కై టిఆర్ఎస్ పార్టీ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని దీనికి నిరసనగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఆదేశాల మేరకు శాంతియుత ఆందోళన చేపట్టినట్లు చంద్రారెడ్డి తెలిపారు. ఒక ఆడపడుచును అక్రమంగా అరెస్టు చేయడం ఈడీ పేరుతో దాడులు నిర్వహించడం బిజెపికే మాత్రమే చెల్లిందని ఆరోపించారు. ఈడి. సిబిఐ లాంటి కేంద్ర ప్రభుత్వ సంస్థలను వినియోగించుకొని టిఆర్ఎస్ పార్టీ నివేదించడం సమంజసం కాదని ప్రభుత్వం తన తీరు వాట్సప్ కాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దిద్యాల జయమ్మ శ్రీనివాస్. మున్సిపల్ చైర్మన్ సుష్మా మహేందర్ రెడ్డి. వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్. మండల పార్టీసీనియర్ నాయకులు నీరటి రాజు ముదిరాజ్. డిసిసిబి డైరెక్టర్ బు ర్కుంట సతీష్. హెూనమల్ల శ్రీనివాస్. గుడాల కృష్ణ గౌడ్. కొత్త యాదగిరి రెడ్డి. బండి శ్రీకాంత్ యాదవ్. మంచర్ల మోహన్ రావు. ప్రశాంత్ రెడ్డి. జీవై ప్రభాకర్. నీళ్ల శ్రీధర్ గౌడ్. హనుమంతు. పొగాకు రాంగోపాల్. తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న బి ఆర్ ఎస్ నాయకులను అదుపుకుంటున్న పోలీసులు



ప్రధాని నరేంద్ర మోడీకి నమస్కరిస్తున్న బిజెపి దళిత రాష్ట్ర నాయకులు జోగి రవి

## రాష్ట్ర బీజేపీ నాయకులను పరిచయం చేసుకున్న ప్రధాని మోడీ

రాజేంద్రనగర్, (ప్రభాత ఉదయం):ప్రధాని నరేంద్ర మోడీ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం లో నిర్వహించిన రోడ్ షో రాజేంద్రనగర్ సర్కిల్ బీజేపీ నేతలు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు.శుక్రవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర దళిత మోర్చా నాయకులు జోగి రవి ప్రధాని నరేంద్ర మోడీ ని పరిచయం చేసుకొని ధన్యవాదాలు తెలియజేశారు.ఈ సందర్భంగా జోగి రవి మాట్లాడుతూ...ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సామాన్య పార్టీ నాయకులను కలవడం ఎంతో సంతోషంగా ఉ ందన్నారు.ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ స్పూర్తితో తమ రాబోయే ఎన్నికల్లో బిజెపిని గెలిపించే దిశగా ముందుకు వెళ్తామన్నారు.

## అభివృద్ధిలో కాలనీ సంఘాలు

# కలసి రావడం సంతోషకరం



న్యూ గ్రీన్ సిటీ కాలనీ సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే తోలుకంటి ప్రకాష్ గౌడ్




న్యూ గ్రీన్ సిటీ కాలనీలో ఏర్పాటు చేసిన ఆర్చ్

బుద్వేల్, మార్చి16(ప్రభాత ఉదయం) : స్థానిక అభివృద్ధిలో కాలనీ సంఘాలు కలిసి రావడం సంతోషకరమని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే తోలుకంటి ప్రకాష్ గౌడ్ అన్నారు. శనివారం బుద్వేల్ న్యూ గ్రీన్ సిటీలో నూతనంగా నిర్మించనున్న కాలనీ సంక్షేమ సంఘం భవనానికి ఆయన కాలనీ కమిటీ ప్రతినిధులతో కలిసి భూమి పూజ చేశారు. అనంతరం కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్చ్ , సూచిక బోర్డులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ, బుద్వేల్ న్యూ గ్రీన్ సిటీ కాలనీలో ఆర్చుల ఏర్పాటు వీధి సూచిక బోర్డుల ఏర్పాటు అభినందించదగ్గ విషయం అన్నారు. గడిచిన 15 సంవత్సరాలుగా రాజేంద్రనగర్ సర్కిల్ లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. బస్తీలు, కాలనీల అభివృద్ధికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటాన న్నారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు శంకర్ , ప్రధాన కార్యదర్శి టి ఆనంద్ గౌడ్, ఉ పాధ్యక్షులు పరమేశ్వర్, కమిటీ సభ్యులు చంద్రకాంత్, లక్ష్మణ్ రెడ్డి, హఫీస్ , రవీందర్ గౌడ్, కిరణ్, రఫీక్, నాయకులు పలుగు చెరువు మహేష్, రగడంపల్లి శ్రావణ్, మజ్జిగ నరేష్ యాదవ్, అనుముల జాన్ పాల్, పుంజాల సాయి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




వీధి నెంబర్లను తెలిపే సూచిక బోర్డుల ప్రారంభోత్సవంలో...



ప్రెస్ అకాడమీ చైర్మన్ కె శ్రీనివాస్ రెడ్డి ని సన్మానిస్తున్న వనం పల్లి జైపాల్ రెడ్డి

## ప్రెస్ అకాడమీ చైర్మన్‌కు సన్మానం

బుద్వేల్, మార్చి16(ప్రభాత ఉదయం) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రెస్ అకాడమీ చైర్మన్ గా నియమితులైన కే శ్రీనివాస్ రెడ్డి ని శనివారం రంగారెడ్డి జిల్లా ఏఐటియుసి కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి పుష్పగుచ్ఛం , శాలువా కప్పి సన్మానం చేయడం జరిగింది. శంషాబాద్ లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనివాస్ రెడ్డి ని జైపాల్ రెడ్డి సన్మానించారు.

## జిల్లా అదనపు ఎస్పీగా గుణశేఖర్ బాధ్యతలు స్వీకరణ




గద్వాల,మార్చి16(ప్రభాత ఉదయం) జోగులాంబ గద్వాల్ జిల్లా కు బదిలీ పై వచ్చిన అదనపు ఎస్పీ కె. గుణశేఖర్ శనివారం సాయంత్రం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా అదనపు ఎస్పీ గా బాధ్యతలను స్వీకరించారు. గ్రూప్ -1 , 2010 బ్యాచ్ డిఎస్పీ గా సెలెక్ట్ అయిన అయన వివిధ ప్రాంతాలలో విధులు నిర్వహించారు. అదనపు ఎస్పీ గా ప్రమోషన్ పొంది హైదరాబాద్ లోని సిఐడి సైబర్ క్రైమ్ విభాగంలో పని చేస్తున్న ఆయన బదిలీలో భాగంగా జిల్లాకు రావడం జరిగింది.

# రాజీ మార్గమే రాజమార్గం

## సివిల్ కేసుల రాజీలో న్యాయవాదుల పాత్ర కీలకం: సీనియర్ సివిల్ జడ్జి సి.ఎం. రాజ్యలక్ష్మి




షాద్ నగర్,మార్చి16(ప్రభాత ఉదయం):సమాజంలో ఒకరితో ఒకరు రాజీ పడి జీవనం కొనసాగించడమే రాజమార్గమని, అనవసరమైన పట్టింపులకు పోయి పౌరులు కోర్టులు,పోలీస్ స్టేషన్ ల చుట్టూ తిరగకుండా లోక్ అదాలత్ ల ద్వారా తమ కేసులను పరిష్కరించుకోవాలని న్యాయ సేవాదికార సంస్థ చైర్మెన్,సీనియర్ సివిల్ జడ్జ్ సి.ఎం. రాజ్యలక్ష్మి పిలుపునిచ్చారు.శనివారం షాద్ నగర్ కోర్టు ప్రాంగణంలో జరిగిన లోక్ అదాలత్ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి సి.ఎం.రాజ్యలక్ష్మి తో పాటు స్పెషల్ ఆఫీసర్ రవీంద్ర సింగ్, జూనియర్ సివిల్ జడ్జి జీవన్ సూరజ్ సింగ్,అడిషనల్ సివిల్ జడ్జి ధీరజ్ కుమార్,అడ్వొకేట్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నర్వ వేణుగోపాల్ రావు తో పాటు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు ఆర్.బాలనంద్ డి.జీ.ఎం.సికింద్రాబాద్,మధు బాబు, వికాస్ సాహూ,జి.నరేందర్, కృష్ణ రెడ్డి,శ్రీ రాం,సుశీల్ కుమార్,అమృత,జె శు భాని లు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో న్యాయవాదులు సబియా సుల్తానా,వై.శ్రీనివాస్, అంజయ్య యాదవ్,జూనియర్ సివిల్ జడ్జ్ లు ప్రసంగిస్తూ రాజీ మార్గమే రాజ మార్గం లోక్ అదాలత్ ద్వారా కేసులు సత్వరంగా పరిష్కరింపబడతాయి.కావున కక్షిదారులకు సత్వర పరిష్కారం లభిస్తుంది అని తెలియ చేశారు.సివిల్ జడ్జ్ సూరజ్ సింగ్ మాట్లాడుతూ...ప్రతి రెండు మూడు నెలలకు ఒక సారి లోక్ అదాలత్ జరగడం వల్ల పండుగ వాతావరణం నెలకొని కక్షిదారులు కేసుల పరిష్కారం జరిగి ఆనందంతో తిరిగి వెళ్లి పోతున్నారు అని తెలిపారు.అనంతరం చైర్మన్ సి.ఎం.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ రాజీ వల్ల ఇరుపక్షాలు గెలిచినట్లేనని,సివిల్ తగదాలలో పోలీస్ వారు తలదూర్చరు కావున సివిల్ కేసుల రాజీ లో న్యాయవాదుల పాత్ర ఎంతో అవసరం అని, తన ఇన్ని సంవత్సరాల సర్వీసులో షాద్ నగర్ న్యాయవాదు ల పాత్ర ఎంతో అమోగమని,కేసుల పరిష్కారంలో ఎంతో ముందంజలో ఉ ంటారని తనకు అందుకే ఈ బార్ అసోషియేషన్ న్యాయవాదులందరు చాలా ఇష్టమని పేర్కొన్నారు.ప్రాణనష్టం జరిగిన కేసులో తరువాత ఎన్ని డబ్బులు ఇచ్చి రాజీ పడ్డ లాభం లేదని కావున అటువంటి వాటిలో ఎవ్వరూ పాల్గొనవద్దని సమాజంలో మంచి పేరుతో బ్రతకాలని అందరికి సూచించారు. ఈ లోక్ ఆదాలత్ లో క్రిమినల్ కేసులు 186,సివిల్ ఒక్క కేసు,డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 383,పిట్టి కేసులు 2730,బ్యాంక్ పి.ఎల్.సి.ఒక్క కేస్,ల్యాండ్ పి. ఎల్.సి.కేస్ రెండు పరిష్కరించబడ్డాయి.మొత్తం కేసుల పరిష్కారంలో 15,26,500 రూపాయల జరిమాన వసూళ్లు చేయడం జరిగిందని కోర్ట్ వర్గాలు తెలిపాయి.ఈ లోక్ అదాలత్ న్యాయవాద సభ్యులుగా సబియా సుల్తానా,శ్వేతా,శ్రీనివాస్ రెడ్డి,సురేందర్ రెడ్డి,గంతల నాగరాజు,లింగం గౌడ్ తో పాటు పోలీస్ సిబ్బంది,కోర్ట్ సిబ్బంది,న్యాయవాదులు పాల్గొని విజయవంతం చేసినందుకు చైర్మన్ అభినందనలు తెలిపారు.కొస మెరుపుగా ఒక కేసు రాజీ విషయంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి పాల్గొని ఇరు పక్షాలను రాజీ పర్చారు..



## జాతీయ లోక్ అదాలత్ 3630 కేసులు పరిష్కారం

గద్వాల,మార్చి16(ప్రభాత ఉదయం)జాతీయ లోక్ అదాలత్ లో భాగంగా శనివారం గద్వాల , అలంపూర్ కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ ఆదాలత్ లో మొత్తం 3,630 కేసులు పరిష్కారమైనట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా న్యాయమూర్తి కె. కుశ తెలిపారు. సివిల్ కేసులు 09, క్రిమినల్ కేసులు 3613, మోటారు వాహన ప్రమాద కేసులు సంబంధించినవి 01, బ్యాంకు ప్రిలిటిగేషన్ కేసులు 07, ఇరువర్గాల వారిని రాజీ కుదిర్చి పరిష్కరించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయ మూర్తి పి.అనిరోజ్ క్రిస్టియన్, ప్రిన్సిపల్ సివియర్ సివిల్ జడ్జి గంట కవితాదేవి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి జి. ప్రభాకర్, అదనపు జూనియర్ సివిల్ జడ్జీ డి. ఉదయ్ నాయక్, న్యాయవాదులు, కక్షిదారులు, కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సోలి టైర్ గ్లోబల్ స్కూల్‌లో

# ఘనంగా గ్రాడ్యుయేషన్ డే




మాస్టర్ ఆర్థిక్‌కు పట్టా అందచేస్తున్న ప్రిన్సిపాల్ అనిల్





గ్రాడ్యుయేషన్ డే లో చిన్నారులు

## ఆకట్టుకున్న చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు

రాజేంద్రనగర్, మార్చి 16 (ప్రభాత ఉదయం): చిన్నారుల అభిరుచులను అలవాట్లను గుర్తించి తల్లిదండ్రులూ మరింత ప్రోత్సహిస్తే మెరుగైన ఫలితాలు సాధిస్తారని సోలి టైర్ గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపల్ అనిల్ వసంత్ అన్నారు. మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని కాటేదాన్ బ్రాంచ్ పాఠశాలలో శనివారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు పట్టభద్రుల వేషధారణలో ఆకట్టుకున్నారు. చిన్నారులకు సర్టిఫికేట్ అందజేశారు. చిన్నారుల పట్టాదారు వేషధారణలో చూసి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ అనిల్ మాట్లాడుతూ... ఎర్లీ ఇయర్స్ పూర్తి చేసుకుని మొదటి తరగతిలోకి అడుగుపెడుతున్న విద్యార్థులకు అభినందనలు తెలిపారు. తరగతి గదిలో మరియు వెలుపల విద్యార్థులలో మంచి విలువలను పెంపొందించాలని తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులను కోరారు. ప్రతి ఒక్కరికి టాలెంట్ ఉంటుంది, సకాలంలో అవకాశాలు సద్వినియోగం చేసుకుంటే ఫలితాలు వస్తాయన్నారు. తల్లిదండ్రుల అభిరుచులు తమ పిల్లల పై భారం వేయడంతో వారు ఒత్తిడికి లోనవుతారన్నారు. ఇద్దరు ఉ ద్యోగాలు చేస్తున్న తలిదండ్రులు తమ పిల్లల కోసం రోజుకు గంట సమయం కేటాయించాలని సెల్ ఫోన్ ల కు దూరంగా ఉంచాలన్నారు.పాఠశాల స్థాపించిన సమయం నుండి ఇప్పటివరకు పాఠశాల అభివృద్ధికి తోడ్పడిన వారికీ ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ సహకారం ఎల్లప్పుడూ ఇలాగే ఉండాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చిన్నారుల ఆట పాటలు అందరిని ఆకట్టుకున్నాయి. చిన్నారులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విశాలాక్షి, ప్రవలిక, సఫీనా, అశ్విని అర్జున్, విద్యార్థుల తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.




నృత్యాలు చేస్తున్న చిన్నారులు



## ఈతకు వెళ్లి బాలుడు మృతి

గద్వాల,మార్చి16(ప్రభాత ఉదయం) అయిజ మండలం మూగోనిపల్లి గ్రామంలో వ్యవసాయ బావిలో సరదాగా ఈత కొట్టాలని వెళ్లిన కురువ నరేష్(10) ప్రమాదవశాత్తు మృతి చెందాడు. మిత్రులతో కలిసి శనివారం గ్రామ శివారులో గల బావిలో ఈత కోసం వెళ్లారు. బావి పై నుండి బావిలోకి దూకడంతో తలకు గాయం కావడంతో స్పృహ కోల్పోయి బావిలో ప్రాణాలు కోల్పోయాడు. కొన్ని క్షణాల్లోనే మిత్రుడు ప్రాణాలు కోల్పోవడంతో స్నేహితులు తల్లడిల్లిపోయారు. బాలుడి తల్లిదండ్రులు ఒక్క సారిగా శోక సముద్రంలో మునిగిపోయారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.